సాక్షి
ప్రకాశం
సోమవారం | 10 | జూలై | 2023



కనిగిరి రోడ్లకు మహర్దశ

కనిగిరి నియోజకవర్గంలో వివిధ రోడ్ల అభివృద్ధికి రూ.19 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. - 8లో..



లింక్ రోడ్డు మంజూరు

కురిచేడు మండలంలో గంగదొనకొండ నుంచి దర్శి మండలం తుమ్మెదలపాడు వరకు లింకు రోడ్డును రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
35 /28

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

స్కే మార్షల్‌ఆర్ట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా శ్రీనివాసరెడ్డి



శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న ప్రతినిధులు

మార్కాపురం: ఆంధ్రప్రదేశ్ స్కే మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షునిగా మార్కాపురం పట్టణానికి చెందిన సీనియర్ కరాటే మాస్టర్ మారంరెడ్డి శ్రీనివాసరెడ్డి ఎంపికయ్యారు. నెల్లూరులో ఆదివారం జరిగిన సమావేశంలో తనను ఎంపిక చేశారని ఆయన తెలిపారు. మార్షల్‌ఆర్ట్స్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు షేక్ ఇస్మాయిల్, షేక్ ఇబ్రహీమ్‌తోపాటు పలువురు శ్రీనివాసరెడ్డిని అభినందించారు.

112 కుటుంబాలకు హైజీన్ కిట్లు అందజేత

- పాల్గొన్న నగర మేయర్, ఒడా చైర్‌పర్సన్



రెడ్‌క్రాస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో హైజీన్ కిట్లు అందచేస్తున్న దృశ్యం

ఒంగోలు అర్బన్: రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు చైర్మన్ ప్రకాష్ బాబు సూచనలతో రెడ్‌క్రాస్ మహిళా విభాగం ఆధ్వర్యంలో తొలి సేవా కార్యక్రమంలో భాగంగా రూ.60 వేలు విలువైన హైజీన్ కిట్లను ఆదివారం దత్తాత్రేయ కాలనీలోని గిరిజవాడకు చెందిన 112 కుటుంబాలకు పంపిణీ చేశారు. దీనికి నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ చైర్‌పర్సన్ శింగరాజు మీనాకుమారి ముఖ్య అతిథులుగా హాజరై కిట్లను పంపిణీ చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ మహిళా విభాగం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. తొలి కార్యక్రమం గిరిజన మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం చేపట్టడం అభినందనీయమన్నారు. ఒడా చైర్‌పర్సన్ మీనాకుమారి మాట్లాడుతూ తాను కూడా జీవితకాల సభ్యురాలిగా రెడ్‌క్రాస్‌లో చేరి సేవలందిస్తానన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ మహిళా విభాగం కన్వీనర్ కుంచాల కోటేశ్వరమ్మ, కో కన్వీనర్ మజ్నుబీబీ, కార్యదర్శి నాయుడు సుజాత, సంయుక్త కార్యదర్శి కోసూరి శ్రీదేవి, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, ట్రెజరర్ రాఘవ, నరసింహరావు, ప్రసన్నరాజు, సునీత, కార్పొరేటర్ శ్రీరాముల నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఓ సంఘ రాష్ట్ర కమిటీలో జిల్లా నాయకులు



వీఆర్ఓ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి

ఒంగోలు అర్బన్: రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్ఓ) సంఘం రాష్ట్ర కమిటీలో జిల్లా నాయకులకు స్థానం లభించింది. ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో రాష్ట్ర ఉపాధ్యక్షునిగా కే రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా పీ బెంజిమెన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పక్కాగా ఓటర్ల లెక్క

గత ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా తయారైన ఓటర్ల జాబితాలపై అధికారులు పారదర్శకంగా పరిశీలన చేపట్టారు. డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, ఒకే ఇంటి నంబరుపై పదుల సంఖ్యలో ఓట్లు, డోర్ నంబర్లు లేనివి.. ఇలా అన్ని రకాల అంశాలపై డోర్ టూ డోర్ సర్వే చేయనున్నారు. ఇప్పటికే అధికారులకు ఆ మేరకు కలెక్టర్ మార్గదర్శకాలు జారీ చేశారు. డివిజన్ల వారీగా అధికారుల శిక్షణ పూర్తికాగా త్వరలో జిల్లాస్థాయిలో శిక్షణ ఇచ్చి సర్వే ప్రారంభించనున్నారు.



- పారదర్శకంగా ఓటర్ల జాబితా తయారు చేసేందుకు అధికారుల కసరత్తు
- ఒకే ఇంటి నంబర్‌తో పదికిపైగా ఓట్లు ఉన్న జాబితాలో జిల్లాలో లక్ష ఓట్లకు పైగా..
- ఇంటి నంబర్ లేకుండా 9948 మంది ఓటర్లు
- ఫొటోలు సరిగా లేని ఓట్లు 64,597
- ఈ నెల 21 నుంచి డోర్ టు డోర్ సర్వే ప్రారంభం

ఒంగోలు అర్బన్:

జిల్లాలో ఓటర్ల జాబితాలోని డబుల్ ఎంట్రీలు ఇతర అన్నీ రకాల ఓట్లను పరిశీలించి నకిలీ ఓట్లు లేకుండా జాబితాను మరింత పారదర్శకంగా తయారు చేసేందుకు కసరత్తు ప్రారంభించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కొత్త డోర్ నంబర్లు కేటాయించారు. ఆ సమయంలో ఓటర్ల జాబితాలో ఒకే డోర్ నంబర్‌పై వందలాది ఓట్లు ఉండటం, మరికొన్ని అసలు డోర్ నంబర్‌లే లేకుండా ఓట్లు ఉండటం వంటి అవకతవకలు జరిగాయి. ఇప్పుడు ప్రతిపక్షంగా ఉన్న టీడీపీ నేతలు వారు చేసిన ఘన కార్యాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పై వేసి ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలోని ఓట్లను వివిధ రకాలుగా విభజించి తనిఖీలు చేపట్టనున్నారు. ఈ నెల 21 నుంచి ఇంటింటి సర్వేకు శ్రీకారం చుట్టారు. ఒకే ఇంటి నంబర్‌పై ఉన్న ఓట్లు, ఇంటి నంబర్‌లేని ఓట్లు, వందేళ్ల వయసు పైబడిన ఓట్లు, ఫొటోలు సరిగాలేని ఓట్లు, మరణించిన వారి ఓట్లు వంటి వాటిపై ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా ఉండేలా సంబంధిత అధికారులు పనిచేస్తున్నారు. ఇప్పటికే డివిజన్ల వారీగా ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేపై శిక్షణలు నిర్వహించారు. త్వరలో జిల్లా స్థాయి శిక్షణ నిర్వహించి సర్వే ప్రారంభించనున్నారు.

తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 17,78,239 మంది ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళా ఓటర్లు 8,90,690, పురుష ఓటర్లు 8,87,432, థర్డ్ జండర్ 117 మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల విభాగం జిల్లాలో ఉన్న ఓట్లలో ఇంటింటి సర్వే చేపట్టనున్న అంశాల్లో వంద సంవత్సరాలు దాటిన ఓటర్లు జిల్లాలో 2178 పోలింగ్ కేంద్రాల పరిధిలో 141 మంది ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా ఒకే ఇంటి నంబర్‌తో పదికిపైగా ఓట్లు ఉన్నవాటి జాబితాలో జిల్లాలో 1,00,084 ఓట్లు ఉన్నట్లు గుర్తించారు. అసలు డోర్‌నంబర్ లేకుండా ఉన్న ఓట్లు 9,948, ఫొటోలు సరిగా లేని ఓట్లు 64,597 ఉన్నట్లు గుర్తించారు. ఎన్నికల విభాగం ఓటర్ల జాబితాను ప్రణాళికాబద్ధంగా పరిశీలించి సరిచేసి పారదర్శకంగా రూపొందిస్తుంటే టీడీపీ నేతలు మాత్రం అధికారంలో ఉన్నప్పుడు చేసిన అక్రమాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం, ప్రభుత్వం అధికార యంత్రాంగం ఏదో చేసినట్లు ఓటర్ల జాబితాపై నిరంతరం ఏదో ఒక ఆగం చేయడం పరిపాటిగా మారింది.

ఓటర్ల జాబితాలో పరిశీలించనున్న ఓట్ల వివరాలు ఇవీ...

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	వంద ఆపై వయసు కలిగిన ఓట్లు	ఒకే డోర్ నంబర్‌తో పది ఓట్లు పైగా ఉన్న గృహాలు	ఒకే డోర్ నంబర్‌తో ఉన్న ఓట్లు	డోర్ నంబర్ లేని ఓట్లు	ఫొటోలు సరిగా లేని ఓట్లు
యర్రగొండపాలెం	264	12	1401	19190	564	6996
దర్శి	282	20	999	13068	456	8043
సంతనూతలపాడు	256	37	573	8163	1501	5379
ఒంగోలు	256	17	904	13189	286	10333
కొండపి	283	18	603	8600	3812	9169
మార్కాపురం	257	4	786	12385	1529	9627
గిద్దలూరు	284	10	699	9298	691	8082
కనిగిరి	296	23	1127	16191	1109	6968
మొత్తం	2178	141	7092	100084	9948	64597

తుది ఓటర్ల జాబితా ప్రకారం జిల్లాలో ఓటర్లు
17,78,239

మహిళా ఓటర్లు
8,90,690

పురుషులు
8,87,432

ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పక్కాగా ఓటర్ల జాబితా



ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందిస్తాం. ఓట్లలో డోర్ నంబర్, ఇతర అంశాలను ఇంటింటి సర్వే చేసి జాబితాను పారదర్శకంగా రూపొందిస్తాం. త్వరలో అన్నీ పోలింగ్ కేంద్రాల పరిధిలో డోర్ టు డోర్ సర్వే చేపడుతున్నాం. దీనిలో వాలంటీర్ల ప్రమేయం లేకుండా చర్యలు తీసుకున్నాం. ఈ ప్రక్రియకు అందరూ సహకరించాలి.
– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి

పులిపాడులో నక్షత్ర తాబేలు



పులిపాడులో కనబడిన నక్షత్ర తాబేలు

ముండ్లమూరు: మండలంలోని పులిపాడు ఎస్సీ కాలనీలో ఆదివారం నక్షత్ర తాబేలు కనిపించింది. నక్షత్ర తాబేలు కాలనీలోని ఇంటి వద్ద చెట్లలోని నుంచి రోడ్డుకి వస్తుండగా కాలనీకి చెందిన వారు చూశారు. దీంతో వారు పోలీసులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం చేరవేశారు. దీంతో అటవీశాఖ అధికారులు నక్షత్ర తాబేలును స్వాధీనం చేసుకున్నారు.

ఆలయ గోపురాలు పరిశీలించిన టీటీడీ అధికారి



త్రిపురాంతకం ఆలయ గోపురం పరిశీలిస్తున్న అధికారులు

త్రిపురాంతకం: పార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాల గోపుర నిర్మాణాలను టీటీడీ సూపరింటెండెంట్ శ్రీకాంత్ పరిశీలించారు. త్రిపురాంతకంలోని త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయం వద్ద పడమర, దక్షిణ గోపురాలు నిర్మించాలని ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి దరఖాస్తు చేయగా టీటీడీ అధికారి పరిశీలనకు వచ్చారు. రెండు గోపురాల నిర్మాణానికి రూ.2.45 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. వివరాలు తెలుసుకున్న అధికారి ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు చెప్పారు. ఈయన వెంట ఆలయాల మాజీ ట్రస్ట్‌బోర్డు సభ్యుడు మల్లికార్జున్, టీటీడీ హెచ్‌డీపీటీ సభ్యుడు ధనుంజయ్‌రావు ఉన్నారు. ఇదే విధంగా దూపాడులోని ఆంజనేయస్వామి ఆలయాన్ని పరిశీలించారు. దూపాడులో ఈయన వెంట ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ ఆళ్ల నాసరరెడ్డి, ఆలయాల అర్చకుడు విశ్వన్నారాయణశాస్త్రి ఉన్నారు.

మహిళా క్రికెట్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన మహిళా క్రికెట్ క్రీడాకారులు

ఒంగోలు: మహిళా క్రికెట్ క్రీడాకారుల ఎంపిక స్థానిక ఏసీఏ మినీ లార్డ్స్ గ్రౌండులో ఆదివారం జరిగింది. అడ్‌హక్ కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.వీరరాఘవరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ ఎంపికలో అండర్ 15, అండర్ 19, సీనియర్ క్రీడాకారుల నైపుణ్యాలను బౌలింగ్, కీపింగ్, బ్యాటింగ్, ఫీల్డింగ్‌ల్లో పరిశీలించి ఎంపిక చేశారు. ఎంపికైన జట్లు ఈనెల 21 నుంచి మంగళగిరిలో జరిగే అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో ప్రకాశం జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుందన్నారు.

అండర్ 15 క్రికెట్ జట్టు:
మోక్షజ్ఞ (కెప్టెన్), సేతుసాయి, ఎ.త్రలోక్య, ఎం.సమన్విత, ఎం.భావనారెడ్డి, టి.కీర్తి, పి.ప్రత్యూష, పి.జాహ్నవి, ఆర్.లలిత, పి.నవ్య, సయ్యద్ షాజియా, జి.కావ్య, ఎస్.ఈక్షిత సుధామ్య, కె.పొష్య వెంకటలక్ష్మి, పి.హైందవి లక్ష్మి.

అండర్ 19 క్రికెట్ జట్టు:
ఎం.అక్షిత (కెప్టెన్), మోక్షజ్ఞ, త్రలోక్య, భావనరెడ్డి, ప్రణతి, సమన్విత, సేతు సాయి, ఆర్.లలిత, ఎస్‌కే జాస్మిన్, షణ్ముఖ ప్రియ, టి.కీర్తి, వి.ఎలిజబెత్, పి.ప్రత్యూష, పి.నవ్య, జి.కావ్య.

సీనియర్స్ మహిళా జట్టు:
పీవీ సుధారాణి (కెప్టెన్), టి.మల్లిక, ఎం.అక్షిత, ఎం.మోక్షజ్ఞ, ఎం.సమన్విత, షేక్ జాస్మిన్, వి.సేతుసాయి, ఎ.త్రలోక్య, ఎం.భావనారెడ్డి, ఆర్.లలిత, వై.ప్రణతి, వి.నవ్యదుర్గ, ఎస్.మౌనిక, పి.ఇంద్రజ, సౌమ్య.

కలెక్టర్ స్పందన నేడు కనిగిరిలో

ఒంగోలు అర్బన్: ప్రతి సోమవారం కలెక్టర్ నిర్వహించే స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నేడు కనిగిరిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. కనిగిరి ఆర్టీసీ బస్టాండ్ ఎదురు ఉన్న పవిత్ర కళ్యాణ మండపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్పందన నిర్వహిస్తారని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు కనిగిరి అసెంబ్లీ నియోజవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు జిల్లా యంత్రాంగం హాజరవుతుందని, నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

ఒంగోలులో స్వల్ప భూప్రకంపనలు

ఒంగోలు: ఒంగోలులో భూమి రెండు సెకన్లపాటు కంపించింది. స్థానిక విజయనగర్ కాలనీ, సీఆర్‌పీ క్వార్టర్లలో ఈ విషయాన్ని స్థానికులు గమనించారు. మంచం మీద ఉన్న తనకు ఏదో భూమికింద పాకుతున్నట్లు అనిపించిదని, ఇదే సమయంలో ఇంట్లోని వస్తువులు కూడా అదరడంతో భూకంపంగా భావించినట్లు ఓ మహిళ పేర్కొంది. మరొకరు తాము వీధిలో నిలుచుని ఉన్నామని, ఒక్కసారిగా ఏదో పడిపోతున్నట్లుగా అనిపించిందని, అయితే అది కూడా కేవలం మూడు సెకన్లకు మించి లేదన్నారు. గత ఏడాది కూడా ఇదే తరహాలో భూప్రకంపన స్వల్పంగా కనిపించిందని, తాజాగా కూడా కనిపించడంతో స్థానికులలో కొంత ఆందోళన నెలకొంది.

ఎయిడెడ్‌లో రేషనలైజేషన్

- ఎయిడెడ్‌లో 284 మంది మిగులు ఉపాధ్యాయులు
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రస్తుతం 45 ఏకోపాధ్యాయ పాఠశాలలు
- ఇకనుంచి ప్రతి పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు
- 15వ తేదీలోగా పూర్తికానున్న రేషనలైజేషన్ ప్రక్రియ

ఒంగోలు: ఎయిడెడ్ పాఠశాలల్లో రేషనలైజేషన్ ప్రక్రియకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో చేపడుతున్న ఈ ప్రక్రియలో 89 ప్రాథమిక పాఠశాలలు, 11 ప్రాథమికోన్నత, 40 ఉన్నత పాఠశాలల్లో దాదాపు 8 వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా ఉపాధ్యాయుల సంఖ్య 645 మంది ఉన్నారు. 30 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న పాఠశాలల సంఖ్యను పరిశీలిస్తే కనిగిరి 5, గిద్దలూరు 8, మార్కాపురం 3, కంభం 5, దొనకొండ 3, అద్దంకి 3, పర్చూరు 6, చీరాల 5, ఒంగోలు మండలంలో 15 ఉన్నాయి.

45 ఏకోపాధ్యాయ పాఠశాలలు:
ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం ఏకోపాధ్యాయ పాఠశాలలు 45 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఉపాధ్యాయుడు సెలవు పెట్టాలన్నా కష్టమైన పని. ఇటువంటి వాటికి స్వస్తి పలుకుతూ రేషనలైజేషన్‌లో సరికొత్త మార్పులు తీసుకొచ్చారు. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతుల వరకు 60 మంది విద్యార్థుల వరకు కనీసంగా ఇద్దరు ఉపాధ్యాయులను నియమిస్తారు. అనంతరం ప్రతి 30 మందికి ఒకరిని కేటాయిస్తారు. 120 మంది దాటితే ఒక హెడ్ టీచర్‌ను అదనంగా నియమిస్తారు. 6 నుంచి 8 తరగతులు ఉండే ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రతి తరగతికి ఒక టీచర్ చొప్పున నియమిస్తారు. అదనంగా ప్రతి 35 మంది పిల్లలకు ఒక టీచరును కేటాయిస్తారు. పిల్లల సంఖ్య 100కు మించితే మాత్రం ఒక హెడ్ టీచర్‌తోపాటు పార్ట్ టైమ్ టీచర్‌గా ఒక ఆర్ట్స్ ఎడ్యుకేషన్, ఒక పీఈటీని నియమిస్తారు. ఉన్నత పాఠశాలల్లో 6 నుంచి 10 తరగతులకు సంబంధించి విద్యార్థుల సంఖ్య 75 లోపు ఉంటే ఆరుగురు ఉపాధ్యాయులు ఉంటారు. 76 నుంచి 200లోపు ఉంటే 9 మంది, అనంతరం ప్రతి 40 మందికి ఒక ఉపాధ్యాయుడ్ని కేటాయిస్తారు.

జిల్లాలో 284 మంది మిగులు ఉపాధ్యాయులు:
విద్యార్థుల సంఖ్య ఆధారంగా రేషనలైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తే జిల్లాలో 284 ఉపాధ్యాయులు మిగులుగా తేలుతున్నారు. ఈనెల 15వ తేదీలోగా రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తిచేయనున్నారు. దీంతో మిగులు ఉపాధ్యాయులను ఏకోపాధ్యాయ పాఠశాలలతోపాటు అవసరమైన ఎయిడెడ్ పాఠశాలల్లో నియమించాలని భావిస్తున్నారు. గిద్దలూరు 32, చీరాల 30, కంభం 27, ఒంగోలు 25, కొమరోలు 22, నాగులుప్పలపాడు 20, దొనకొండ 18, హనుమంతునిపాడు 12, మార్కాపురం 12, వై.పాలెం 10, ఇంకొల్లు 10, కనిగిరి 9, వెలిగండ్ల 8, పర్చూరు 7, కొరిశపాడు 5, పుల్లలచెరువు 4, జె.పంగులూరు 3, అర్ధవీడు 3, రాచర్ల 3, అద్దంకి 2, మద్దిపాడు 2, చీమకుర్తి 2, సీఎస్‌పురం 2, వేటపాలెం 2, చినగంజాం 2, కారంచేడు 2, కొనకనమిట్ల 2, కొత్తపట్నం 2, దర్శి 1, బేస్తవారిపేట 1, యద్దనపూడి 1, మార్టూరు 1, టంగుటూరు 1 ఉన్నారు. ఈ మిగులు ఉపాధ్యాయులను అవసరమైన ఎయిడెడ్ పాఠశాలలకు బదిలీ చేయనున్నారు.

సీఎం జగన్‌తోనే బీసీలకు గౌరవం

- వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గోలి తిరుపతిరావు, బీసీ ప్రజాప్రతినిధులు, సంఘాల నాయకులు

ఒంగోలు: బీసీలంటే సమాజానికి బ్యాక్ బోన్ అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన నినాదం ప్రతి ఒక్క బీసీలో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో బీసీల్లో ఎన్ని సామాజికవర్గాలు ఉన్నాయో కూడా తెలియని స్థితిలో బీసీ అధ్యయన కమిటీ వేసిన సీఎం జగన్.. ఎన్నికలకు ముందే బీసీ డిక్లరేషన్ ప్రకటించడంతో పాటు అధికారంలోకి వచ్చిన వెంటనే 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి బీసీలకు మేలు చేసిన విషయం ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. మంచి చేసేవారిని గుండెల్లో పెట్టుకుని చూసుకునే తత్వం బీసీలదని తెలిపారు. కానీ, టీడీపీలో ఉన్న కొంతమంది నాయకులు కనీస జ్ఞానం కూడా లేకుండా ఇష్టం వచ్చినట్లు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం బాధాకరమన్నారు. ఎక్కడ ఉన్నా బీసీలు శక్తుల్లా వ్యవహరించాలని, అంతే తప్ప ఏ ఒక్కరికో తొత్తుల్లా వ్యవహరించడం సరికాదని అన్నారు. నాడు బీసీ కార్పొరేషన్ రుణాలంటూ వేల మంది దరఖాస్తు చేసుకుంటే.. వందల్లో కూడా రుణాలివ్వని చంద్రబాబు ప్రభుత్వం.. నేడు జగన్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. నేడు దరఖాస్తులు, జన్మభూమి కమిటీల సంతకాలు వంటి వాటితో సంబంధం లేకుండా వివిధ పథకాల ద్వారా నేరుగా ప్రతి కుటుంబానికి లక్షల రూపాయల్లో లబ్ధి చేకూర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు.

చాత్తాడ శ్రీవైష్ణవ కార్పొరేషన్ చైర్మన్ టి.మనోజ్‌కుమార్ మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ కార్యాలయాల్లోకి అడుగుపెట్టి పాలన ఎలా జరుగుతుందో తెలుసుకోవాలని టీడీపీ నేతలకు హితవు పలికారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ ధరణికోట లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నాయీబ్రాహ్మణుల సమస్యలపై ప్రత్యేకమైన జీవోలిచ్చి పరిష్కారానికి సీఎం వైఎస్ జగన్ కృషి చేశారని కొనియాడారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తోకలు కత్తిరిస్తా అంటూ హెచ్చరించినా మౌనంగా ఉండి నేడు కొందరు విమర్శలు చేయడం కేవలం వారి రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న యత్నమే అని విమర్శించారు. నాయీబ్రాహ్మణులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదికి రూ.50 కోట్ల మేరకు లబ్ధిచేకూరుస్తున్నారన్నారు. విలేకరుల సమావేశంలో నాయీబ్రాహ్మణ సంఘ జిల్లా నాయకుడు మద్దలూరి శ్రీనివాసులు, రజక సంఘ జిల్లా అధ్యక్షుడు మార్నెళ్ల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు సుతారం శ్రీనివాసులు, సూర్య బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి కరుణాకర్, మేదర సంఘ అధ్యక్షుడు కేత చలపతిరావు, నాయీబ్రాహ్మణ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటూరు మస్తాన్‌రావు, వైఎస్సార్ సీపీ నగర ప్రచార కార్యదర్శి ఏల్చూరి రమేష్, మిరియాల రాఘవ, ముదిరాజ్ సంఘ జిల్లా అధ్యక్షుడు పందీటి శ్రీను, మాచవరపు వీరేంద్ర తదితరులు పాల్గొని ప్రసంగించారు.

కళలను ప్రోత్సహిస్తున్న రంగభూమికి సలాం



నటరాజస్వామి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రంగభూమి కళాకారుల సంఘ సభ్యులు, అతిథులు

ఒంగోలు టౌన్: ప్రజల మానసిక వికాసానికి దోహదపడుతూనే సామాజిక చైతన్యానికి పాటుపడుతున్న జిల్లా రంగభూమి కళాకారుల సంఘం చేస్తున్న కృషిని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. రంగభూమి 6వ వార్షిక వేడుకలు సీవీఎన్ రీడింగ్ రూంలో ఆదివారం నిర్వహించారు. ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే ప్రతినెలా రంగభూమి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇక ముందుకూడా ఇదే తీరున ప్రతినెలా కళాప్రదర్శనలు కొనసాగిస్తామని నాటక అకాడమీ మాజీ రాష్ట్ర సభ్యులు ధేనువకొండ సుబ్బయ్య తెలిపారు. ఒంగోలు ప్రాంతంలోని కళాకారులకు రంగభూమి ఒక వేదికగా నిలబడడం గొప్ప విషయమని, నాటక రచయిత పాడిబండ్ల ఆనందరావు సంతోషం వ్యక్తం చేశారు. ప్రతినెలా కార్యక్రమాలు చేస్తున్న ఘనత రంగభూమికి దక్కుతుందని ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు తెలిపారు. అనంతరం పూల రంగడు హాస్య నాటికను ప్రదర్శించారు. ఎస్‌కే బాబు దర్శకత్వం వహించిన ఈ నాటికలో నటించిన నటులు ఆయా పాత్రలకు జీవం పోశారు. నాటిక ఆద్యంతం నవ్వులు పూయించింది. కార్యక్రమంలో శతాధిక గ్రంథ రచయిత డా.నాగభైరవ ఆదినారాయణ, కుర్రా ప్రసాద్‌బాబు, వాక సంజీవ రెడ్డి, కనమాల రాఘవులు, అంగలకుర్తి ప్రసాద్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సముద్రంలో గల్లంతైన యువకులు

● రక్షించిన మెరైన్ పోలీసులు



సముద్రంలో గల్లంతైన యువకులను కాపాడుతున్న మెరైన్ పోలీసులు

కొత్తపట్నం: ఇద్దరు యువకులు సముద్రంలో స్నానం చేస్తూ గల్లంతై కొట్టుకుపోతుండగా మెరైన్ పోలీసులు రక్షించారు. ఈ సంఘటన ఆదివారం కొత్తపట్నం సముద్రతీరంలో చోటుచేసుకుంది. ఒంగోలు నగరంలోని నవభారత్ బిల్డింగ్ వద్ద నివాసం ఉంటున్న ఆరుగురు కుటుంబ సభ్యులు ఆదివారం కావడంతో మధ్యాహ్నం సరదాగా కొత్తపట్నం బీచ్‌కు వచ్చారు. ఆరుగురూ సముద్రంలో దిగి స్నానం చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల ఉధృతికి ఎం.శ్రీనివాసరావు, భవానిశంకర్ అనే యువకులు గల్లంతై కొట్టుకుపోతున్నారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న మెరైన్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ పోల్‌రాజు, హోంగార్డ్ లక్ష్మణ్ ఈత కొట్టుకుంటూ వెళ్లి గల్లంతైన యువకులను అతి కష్టం మీద ఒడ్డుకు చేర్చారు. ప్రథమ చికిత్స చేసి బంధువులకు అప్పగించారు. తమ పిల్లలకు పునర్జన్మ ప్రసాదించారంటూ మెరైన్ పోలీసులకు యువకుల కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మెరైన్ ఎస్సై వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.



యువకులను ఒడ్డుకు చేర్చి బంధువులకు అప్పగిస్తున్న మెరైన్ పోలీసులు

9 మంది జూదరుల అరెస్టు

కొమరోలు: మండలంలోని పొట్టిపల్లె గ్రామ సమీపంలోని పొలాల్లో ఆదివారం పేకాట ఆడుతున్న 9 మందిని అరెస్టు చేసినట్లు స్థానిక ఎస్సై సుబ్బరాజు తెలిపారు. సమాచారం అందగానే సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేసి జూదరులను పట్టుకుని వారి నుంచి రూ.7,300 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు. అరెస్టు చేసిన వారిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వాట్సాప్ లింకులతో మోసగాళ్ల వల

● జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ సూచన

ఒంగోలు టౌన్: సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని మోసగాళ్లు బరితెగిస్తున్నారని, బడా కంపెనీల పేరుతో ఫ్రీ ప్రిస్క్రిప్షన్ అంటూ వచ్చే వాట్సాప్ లింకులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ సూచించారు. ఆ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. నెట్‌ఫ్లిక్స్, అమెజాన్, ప్రైమ్, ఆహా, డిస్నీ హాట్ స్టార్ లాంటి ప్రఖ్యాత కంపెనీల పేరుతో సైబర్ నేరగాళ్లు ఓటీటీ ప్లాట్‌ఫామ్స్‌కు నకిలీ లింకులను వాట్సాప్‌లలో సర్క్యులేట్ చేస్తున్నారని తెలిపారు. మోసంలో భాగంగా మొదట నకిలీ ఉచిత ప్రిస్క్రిప్షన్ ఆఫర్ లింకులు పంపిస్తారన్నారు. ఉచితం కదా అని ఆశపడి లింకు మీద క్లిక్ చేయగానే దానికి సంబంధించి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌కు యాప్ డౌన్లోడ్ చేయమని మెసేజ్ వస్తుందని వివరించారు. యాప్‌ను ఇన్‌స్టాల్ చేయగానే యాక్టివేట్ చేయడానికి ఓటీపీ అడుగుతారని, పొరపాటున ఓటీపీని ఎంటర్ చేస్తే మన ఫోన్‌లోని సమాచారం అంతా వారి ఆధీనంలోకి వెళ్తుందన్నారు. బ్యాంకు ఖాతాలోని డబ్బు మాయం చేస్తారని హెచ్చరించారు. ఎవరైనా ఇలాంటి సైబర్ నేరగాళ్ల చేతిలో మోసానికి గురైతే హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయాలని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

మార్టూరు: జాతీయ రహదారిపై మార్టూరు మండలంలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఆటో డ్రైవర్ మృతి చెందాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. టోల్ ప్లాజా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనగా ఆటోలో అపస్మారక స్థితిలో ఇరుక్కున్న డ్రైవర్‌ను గమనించిన స్థానికులు హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించారు. బాధితుడిని ఆటోలో నుంచి అతికష్టం మీద బయటకు తీసి మార్టూరు ప్రభుత్వాస్పత్రికి అంబులెన్స్ సిబ్బంది తరలించారు. అతని వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా, ఆటో డ్రైవర్ తనది గుంటూరు అని మాత్రమే చెప్పి మృతి చెందాడు. మృతుడికి 55 ఏళ్ల వయసు ఉండొచ్చని సిబ్బంది తెలిపారు.

విద్యుత్ తీగలు తగిలి మహిళకు తీవ్రగాయాలు

జరుగుమల్లి (సింగరాయకొండ): ప్రమాదవశాత్తూ ఇంటిపై చేతికందేంత ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలు తగిలి మహిళకు తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం ఉదయం జరుగుమల్లి మండలం కే బిట్రగుంట పంచాయతీ ఎస్టీకాలనీలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... ఎస్టీకాలనీకి చెందిన యాటగిరి నారాయణ (40) తన ఇంటిమిద్దెపై పడుకుని ఉన్న పిల్లలను లేపేందుకు వెళ్లే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి మేడపై నుంచి కిందపడిపోయింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెకు స్థానిక ఆర్ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేయించి చెన్నై తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి ప్రమాదకరంగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె భర్త, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.



తారురోడ్డుగా మారనున్న కనిగిరి - కలగట్ల మట్టిరోడ్డు



తారురోడ్డుగా మారనున్న లింగన్నపాలెం మట్టిరోడ్డు

కనిగిరి రోడ్లకు మహర్దశ

- స్థానిక ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ కృషితో రూ.19 కోట్లతో రోడ్ల అభివృద్ధి
- నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల చేసిన ప్రభుత్వం
- వాటిలో రూ.11 కోట్లతో కనిగిరి – కలగట్ల రోడ్డుకు మోక్షం
- రూ.6 కోట్లతో లింగన్నపాలెం – మాలకొండ రోడ్డు అభివృద్ధి
- రూ.2 కోట్లతో మొగుళ్లూరు – వేములపాడు రోడ్డుకు మరమ్మతులు
- ఎన్నో ఏళ్ల నాటి కల నెరవేరుతుండటంతో ఆనందంలో ప్రజలు



రోడ్ల అభివృద్ధిపై సంతోషం వ్యక్తం చేస్తున్న రాచగుండ్లపాడు గ్రామస్తులు

కనిగిరి రూరల్: కనిగిరి నియోజకవర్గ ప్రజల ఎన్నో ఏళ్ల నాటి రోడ్ల అభివృద్ధి కల నెరవేరబోతోంది. స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ విన్నపం మేరకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కనిగిరి నియోజకవర్గంలోని మూడు రోడ్ల అభివృద్ధికి రూ.19 కోట్లు మంజూరు చేశారు. ఆర్‌అండ్‌బీ (ఎండీఆర్) ప్లాన్ గ్రాంట్ మంజూరు చేస్తూ ఈ నెల 5వ తేదీ జీవో విడుదల చేశారు. త్వరలో రోడ్ల పనులకు టెండర్లు పిలవనున్నారు. దీంతో కనిగిరి ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం రూ.19 కోట్లలో కనిగిరి మండలంలోని కనిగిరి – కలగట్ల రోడ్డుకు రూ.11 కోట్లు, పీసీ పల్లి మండలంలోని పెదఇర్లపాడు వయా గుంటూరు లింగన్నపాలెం రోడ్డుకు రూ.6 కోట్లు, వెలిగండ్ల మండలంలోని మొగుళ్లూరు – వేములపాడు రోడ్డుకు రూ.2 కోట్లు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

కనిగిరి – కలగట్ల మట్టిరోడ్డుకు మోక్షం...

తాతల కాలం నాటి నుంచి మట్టిరోడ్డుగా మిగిలిపోయిన కనిగిరి – కలగట్ల, పోలారం రోడ్డుకు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ కృషితో మోక్షం కలిగింది. నేతలెందరు మారినా ఈ రోడ్డు తలరాత మారలేదనే నానుడికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెక్ పెట్టింది. గతంలో పాలకులెవరూ ఈ రోడ్డు గురించి పట్టించుకోలేదు. ఫలితంగా ఐదు గ్రామాల ప్రజలు నిత్యం ఇబ్బందిపడుతున్నారు. వైఎస్సార్ సీపీ పాలనలో త్వరలో ఆ సమస్య పరిష్కారం కానుంది.

ఈ రోడ్డుతో ఉపయోగమిలా...

నియోజకవర్గంలోని కనిగిరి, పీసీ పల్లి మండలాలకు కలగట్ల రూటు లింకు రోడ్డుగా ఉంది. కనిగిరికి 12 కి.మీ దూరం వరకు కలగట్ల, రాచగుండ్లపాడు, నిమ్మమహేశ్వరపురం, పోలారం, కొత్తపల్లి గ్రామాలున్నాయి. అదే రూట్‌లో వయా ముద్దపాడు, వాకంవారిపల్లి, మర్రికుంటపల్లి, పీసీ పల్లికి 19 కి.మీ దూరంలో చేరవచ్చు. ఇదే మార్గంలో రెండు కి.మీ దూరంలో వాగుపల్లి, మూడు కి.మీల దూరంలో లింగారెడ్డిపల్లి చేరవచ్చు. కలగట్ల గ్రామం కనిగిరి, పీసీ పల్లి మండలాలకు జంక్షన్ గ్రామంగా ఉంది. ఈ రోడ్డు తారురోడ్డుగా మారితే అనేక గ్రామాల ప్రజలకు ఉపయోగం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.11 కోట్లతో 12.02 కి.మీ దూరం గల మట్టిరోడ్డును తారురోడ్డుగా మార్చనుంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తారురోడ్డుగా మారనున్న లింగన్నపాలెం రోడ్డు...

పీసీ పల్లి మండలంలోని గుంటూరు లింగన్నపాలెం టు మాలకొండ రోడ్డు అభివృద్ధికి రూ.6 కోట్లు మంజూరయ్యాయి. పెద ఇర్లపాడు వయా (7 కి.మీ రాయి వద్ద నుంచి) గుంటూరు లింగన్నపాలెం నుంచి మాలకొండ వరకు 5.5 కి.మీ దూరం మట్టిరోడ్డును తారురోడ్డుగా మార్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఈ రోడ్డు నిర్మాణంతో పీసీ పల్లి మండలం నుంచి నెల్లూరు జిల్లా కావలి వెళ్లేందుకు దూరం తగ్గుతుంది. కనిగిరి నుంచి కందుకూరు మీదుగా కావలి వెళ్లాలన్నా.. అలాగే కనిగిరి నుంచి పామూరు మీదుగా కావలి వెళ్లాలన్నా సుమారు 160 కి.మీ దూరం ఉంటుంది. ఇదే పెదఇర్లపాడు వయా లింగన్నపాలెం టు మొగిలిచెర్ల మీదుగా వెళ్తే 40 కి.మీ దూరం తగ్గుతుంది. రెండు జిల్లాల్లో ప్రసిద్ధి చెందిన లక్ష్మీనరసింహ స్వామి (మాలకొండ దేవస్థానం) ఆలయం వద్దకు ప్రతి శనివారం సుమారు 100కుపైగా వాహనాలు వెళ్తాయి. మొగిలిచర్ల దత్తాత్రేయస్వామి దేవస్థానం వద్దకు కూడా ఇదే మార్గాన వెళ్లవచ్చు. మట్టిరోడ్డును తారురోడ్డుగా మార్చడం వలన ప్రజలకు ఎంతో ఉపయోగం కలగనుంది. రెండు జిల్లాలకు జంక్షన్ పాయింట్‌గా ఈ రోడ్డు ఉపయోగపడనుంది.

రూ.2 కోట్లతో మొగుళ్లూరు – వేములపాడు రోడ్డు అభివృద్ధి...

వెలిగండ్ల మండలంలోని మొగుళ్లూరు – వేములపాడు రోడ్డు సుమారు 10 కి.మీ దూరం తారురోడ్డు లేయర్ మరమ్మతులకు గురైంది. దాని అభివృద్ధికి రూ.2 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో ప్రయాణికులకు ఎంతో మేలు జరగనుంది.

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం :



నియోజకవర్గంలోని మూడు రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.19 కోట్ల నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. త్వరలో టెండర్లు పిలిచి ఆయా రోడ్ల అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం. రోడ్ల అభివృద్ధికి అడిగిన వెంటనే నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి తాను, కనిగిరి నియోజకవర్గ ప్రజలు జీవితాంతం రుణపడి ఉంటాం

బుర్రా మధుసూదన్‌యాదవ్, ఎమ్మెల్యే, కనిగిరి

గత పాలకులు పట్టించుకోలేదు :



నాది పీసీ పల్లి మండలం లక్ష్మక్కపల్లి పంచాయతీ లింగన్నపాలెం గ్రామం. శతాబ్దాల కాలం నుంచి మా రోడ్డు మట్టిరోడ్డుగానే ఉంది. ఎంతో మంది నాయకులు వచ్చారు. ఎన్నో ప్రభుత్వాలు మారాయి. కనీసం అభివృద్ధి చేయలేదు. ప్రస్తుతం మా ప్రభుత్వంలో రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదలైంది. అందుకు కృషి చేసిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు మా మండలం, పంచాయతీ ప్రజల తరఫున కృతజ్ఞతలు.

అత్యాల జఘన్య, ఎంపీపీ, పీసీ పల్లి

త్వరలో పనులు ప్రారంభిస్తాం :

కనిగిరి నియోజకవర్గంలోని మూడు రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.19 కోట్ల నిధులు మంజూరు చేసింది. సుమారు 18 కి.మీ దూరం మట్టిరోడ్డును తారురోడ్డుగా మార్చేందుకు, 10 కి.మీ దూరం రోడ్డు లేయర్ లెవల్ పనులకు ఎండీఆర్ ప్లాన్ గ్రాంట్ నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 5న జీవో ఇచ్చింది. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం

ఎస్‌కే ఫిరోజ్, ఆర్‌అండ్‌బీ జేఈ, కనిగిరి

తుమ్మెదలపాడు–గంగదొనకొండ

లింక్ రోడ్డు మంజూరు



అభివృద్ధి చెందనున్న పడమరగంగవరం - రెడ్డెన్నపల్లి రోడ్డు

కురిచేడు: కురిచేడు మండలంలోని గంగదొనకొండ గ్రామం నుంచి పడమర గంగవరం, రెడ్డెన్నపల్లి గ్రామాల మీదుగా దర్శి మండలం తుమ్మెదలపాడు వరకు లింకు రోడ్డును రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. గత ప్రభుత్వాలు ఈ రోడ్డు గురించి పట్టించుకున్న పాపానపోలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రోడ్డు మంజూరు చేయాల్సిన ఆవశ్యకతను పడమర గంగవరం సర్పంచ్ కాసు భాస్కరరెడ్డి, రెడ్డెన్నపల్లి విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ కాసు బ్రహ్మారెడ్డి, కన్వీనర్, ఉపాధ్యాయుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి, తదితరులు దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్‌కు వివరించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి దృష్టికి కూడా తీసుకెళ్లారు. ఆయా గ్రామాల ఆవిర్భావం నుంచి మట్టిరోడ్లు తప్ప ఇప్పటి వరకు పరిపాలించిన ప్రభుత్వాలు తారురోడ్డు గురించి ఆలోచించిన దాఖలాలు లేవని వివరించారు. ప్రజల ఇబ్బందులను గమనించిన ఎంపీ, ఎమ్మెల్యేల కృషితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెంకటాచలంపల్లి నుంచి దొనకొండ వయా తుమ్మెదలపాడు, రెడ్డెన్నపల్లి, పడమర గంగవరం రోడ్డుకు రూ.9 కోట్ల నిధులు మంజూరు చేసింది. నాలుగేళ్ల కృషి ఫలించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో పడమరగంగవరం, రెడ్డెన్నపల్లి గ్రామాల ప్రజలకు దర్శి వెళ్లేందుకు మార్గం దగ్గరవనుంది. తమ చిరకాల కోరిక నెరవేర్చినందుకు దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, పడమర గంగవరం సర్పంచ్ కాసు భాస్కరరెడ్డి, రెడ్డెన్నపల్లి గ్రామ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ కాసు బ్రహ్మారెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

తాతల కాలం నాటి కల నెరవేరుతోంది :



కనిగిరి మండలం తాతల కాలం నాటి నుంచి మా ఊరి రోడ్డు మట్టి రోడ్డుగానే ఉంది. మా పంచాయతీలోని కలగట్ల రోడ్డుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మోక్షం కలగడం నాకెంతో సంతోషంగా ఉంది. ఈ రోడ్డు అభివృద్ధితో ఐదు గ్రామాల ప్రజల కష్టాలు తీరుతాయి. అంతేగాకుండా రెండు మండలాలకు జంక్షన్ పాయింట్‌గా ఉన్న ఈ రోడ్డుతో ఎంతో ఉపయోగం ఉంటుంది. కనిగిరి టు కలగట్ల మట్టి రోడ్డును తారు రోడ్డుగా మార్చేందుకు నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌కి తామంతా ఎల్లప్పుడూ అండగా ఉంటాం. ఎమ్మెల్యే కృషి ప్రశంసనీయం.

మునగల పెద్ద కోటమ్మ (సర్పంచ్, పాలారం)



వలకు భారీగా చిక్కిన కానాగంతలు చేపలు

వల పండింది..

● సముద్రంలో ఆశాజనకంగా వేట

చీరాల: వేట నిషేధం అనంతరం మత్స్యకారుల వల బాగా పండింది. జూన్ 15 వరకు సముద్రంలో రెండున్నర నెలల పాటు నిర్వహించిన వేట నిషేధం అనంతరం కొద్దిరోజులుగా సముద్రంలో తక్కువగా లభించిన మత్స్య సంపద ఆదివారం అదరగొట్టింది. శుక్ర, శనివారం ఉదయం, రాత్రికి వేటకు వెళ్లిన వాడరేవు మత్స్యకారులకు అధిక మొత్తంలో చేపలు, రొయ్యలు, పీతలు వలలకు చిక్కడంతో మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారులు గంగమ్మతల్లికి పూజలు నిర్వహించి చేపల వేటకు వెళ్లి ఆదివారం ఉదయానికి తీరానికి చేరుకున్నారు. వేటచేయగా వలలకు చిక్కిన కూన, రొయ్యలు, పారల, సొర, వంజరం, పండుగప్ప, గురకలు, తోక చేపలు, చేపలు లభించడంతో తీరం ఒడ్డు అంతా కొనుగోళ్లు అమ్మకాలతో సందడిగా మారింది. చీరాల వాడరేవు నుంచి సముద్ర సంపదను చెన్నై, కలకత్తా, మైసూరు, బెంగళూరు, హైదరాబాద్ వంటి ముఖ్య పట్టణాలకు ఎగుమతి చేస్తుంటారు. మత్స్య సంపదను తీరం ఒడ్డునే వేలం పాటలో విక్రయించి మత్స్యకారులు సంతృప్తి చెందారు. అధిక మొత్తంలో మత్స్య సంపద లభించడంతో కొంత ఆనందంగా ఉన్నామని మత్స్యకారులు చెప్తున్నారు.



భారీగా వలకు చిక్కిన టైగర్ రొయ్యలు

ఐస్ అమ్ముకోవడానికి వెళ్లి మృత్యువాత

● విద్యుత్ షాక్‌తో మృతి



సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ నఫీజ్‌బాషా, ఎస్సై బాజిరెడ్డి

ఉలవపాడు: బతుకు దెరువు కోసం.. ఐస్ అమ్ముకోవడానికి వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని కరేడు పల్లెపాలెం వద్ద ఆదివారం జరిగింది. వివరాలు సింగరాయకొండ మండలం బింగినపల్లె కు చెందిన మేడిదబాలకోటయ్య (44) టీవీఎస్ ఎక్సెల్ పై ఐస్ అమ్ముకుని జీవిస్తుంటాడు. ఆదివారం ఐస్ అమ్ముకోవడానికి కరేడు పెదపల్లెపాలెం వెళ్తున్నాడు. మధ్యలో ఉన్న రొయ్యలచెరువుల వద్ద అమ్ముకోవడానికి వెళుతున్న సమయంలో రోడ్డు మీద 11 కేవీ విద్యుత్ వైరు పడి ఉంది. ద్విచక్రవాహనం పై వెళుతున్న సమయంలో కింద ఉన్న వైరు కాలికి తగలడంతో విద్యుత్ షాక్ కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఇద్దరు అబ్బాయిలు, ఒక అమ్మాయి కాగా ఎవరికీ వివాహం కాలేదు. ఐస్ అమ్ముకుంటేనే ఆ కుటుంబం గడిచేది. ఈ పరిస్థితుల్లో విద్యుత్‌షాక్ తో మృతిచెందడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. చెరువుల వద్ద రోడ్డు మీద విద్యుత్ తీగ వేయడం ఎవరి నిర్లక్ష్యం వలన జరిగింది అనే దానిపై విచారణ నిర్వహిస్తున్నారు. కందుకూరు సీఐ నఫీజ్‌బాషా, ఎస్సై బాజిరెడ్డి లు సంఘటనా స్థలిని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

టంగుటూరు(సింగరాయకొండ): గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెం సమీపంలో ఆదివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో చోటుచేసుకుంది. టంగుటూరు పంచాయతీ అంబేడ్కర్ నగర్‌కు చెందిన కంకణాల కోటేశ్వరరావు(53) తూర్పు నాయుడుపాలెంలో తమ బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరయ్యారు. తిరిగి టంగుటూరు వచ్చేందుకు జాతీయ రహదారి దాటే క్రమంలో ఒంగోలు వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై ఖాదర్‌బాషా

కారు – బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలు

గిద్దలూరు రూరల్: కారు – బైక్ ఢీకొని వ్యక్తికి గాయాలైన సంఘటన గిద్దలూరు మండలంలోని నంద్యాల రోడ్డుపై అక్కల్‌రెడ్డిపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం జరిగింది. గిద్దలూరు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న మోతుకూరి సురేష్ ద్విచక్రవాహనంపై వెళ్తున్న సమయంలో నంద్యాల వైపు నుంచి వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. గాయపడిన సురేష్‌ను 108లో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కారు డ్రైవర్ కూడా ఆర్టీసీలోనే పనిచేస్తున్నట్లు తెలిసింది. అతను పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



గాయపడిన సురేష్